సాక్షి బాపట్ల

ఆదివారం । 5 । జనవరి । 2025



హుండీ కానుకల లెక్కింపు

కారెంపూడి: కారెంపూడిలోని చెన్నకేశవస్వామి హుండీ కానుకల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. ఏడాదికిగాను రూ.1,31,046 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ కొల్లి తెలిపారు.



హంపికి అభినందనలు

తాడేపల్లిరూరల్: ప్రపంచ మహిళా చెస్ విజేత కోనేరు హంపిని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు కొలనుకొండలో ఆమె నివాసంలో శనివారం కలిసి అభినందించారు.



కల్యాణ మహోత్సవాలు

గుంటూరురూరల్: గోరంట్లలోని వేంకటేశ్వర స్వామి పెద్దగుడిలో నిర్వహిస్తున్న కల్యాణ మహోత్సవాలలో భాగంగా శనివారం స్వామిని పరశు రామ అవతారంలో అలంకరించారు.

న్యూస్‌రీల్

శ్వేతనాగుకు ప్రత్యేక పూజలు



చీరాల టౌన్: అరుదుగా కనిపించే శ్వేతనాగు శనివారం చీరాల మండలంలోని ఈపురుపాలెంలో ప్రత్యక్షమైంది. నాగేశ్వరస్వామి బంగారు వర్ణం, శ్వేత నాగు దర్శనమివ్వడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ఈపురుపాలెం పంచాయతీలోని పద్మనాభునిపేటకు చెందిన గోలి సులోచన తన ఇంటి పెరట్లో ఉన్న తులసి చెట్టుకు పూజ చేసేందుకు వెళ్లడంతో తులసి చెట్టుపై బంగారు వర్ణంతో శ్వేత నాగుపాము దర్శనమిచ్చింది. శనివారం కావడం, తమ ఇంటికి నాగేంద్రస్వామి స్వయంగా వచ్చాడని గృహిణి ప్రత్యేక పూజలు చేసింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు శ్వేత నాగును తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసం, సంక్రాంతి పండుగ సమయంలో తమ ఇంటికి నాగేంద్రస్వామే స్వయంగా వచ్చాడని ఆ కుటుంబ సభ్యులు భక్తి పారవశ్యంతో పులకించారు. భక్తులు అధికంగా వచ్చి నాగుపాముకు పాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

కోర్టు భవనాలను పరిశీలించిన జిల్లా జడ్జి



పర్చూరు (చినగంజాం): పర్చూరు కోర్టు భవనాలను ప్రకాశం జిల్లా జడ్జి భారతి శనివారం పరిశీలించారు. కోర్టు భవనం పెచ్చులు ఊడిపోయి శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుత కోర్టుని పర్చూరులోని మార్కెటింగ్ యార్డు బిల్డింగ్‌కు మార్చనుండటంతో ఆమె పరిశీలించారు. మార్చటానికి కావాల్సిన వసతులు గురించి ఆర్ అండ్‌బీ అధికారులతో ఆమె చర్చించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి, జూనియర్ సివిల్ జడ్జి శాంతి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన అవసరం



వేటపాలెం: ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో విద్యార్థులు ఏ విధంగా రక్షణ చర్యలు చేపట్టాలో అవగాహన కలిగి ఉండాలని నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు (ఎన్డీఆర్ఎఫ్) టీం కమాండర్ ఇన్‌స్పెక్టర్ ముఖేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం పందిళ్లపల్లి జెడ్పీహెచ్ పాఠశాలలలో ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు విపత్తులు వచ్చినప్పుడు ఎలా ఎదుర్కోవాలో ప్రదర్శన చేసి చూపించారు. అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, వరదలు వచ్చిన సమయంలో ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చిన సమయంలో ఛాతి కుదింపులతో కూడిన అత్యవసర చికిత్స విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్టు గ్రేడ్-2 మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్ : గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయంలో ఫార్మాసిస్టు గ్రేడ్-2 పోస్టుల ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల చేసినట్లు మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ సుచిత్ర శనివారం తెలిపారు. ఫైనల్ మెరిట్ లిస్టుపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 10వ తేదీలోపు తమ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు.

ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలి

నరసరావుపేటరూరల్: విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు డిసెంబర్ నెల జీతాలు అందలేదని, వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. డిసెంబర్ జీతాలు కొన్ని ఉద్యోగ శాఖల పెన్షనర్లకు చెల్లించారని, విద్యాశాఖలోని దాదాపు రెండు లక్షల మంది ఉపాధ్యాయులకు నేటి వరకు అందలేదని తెలిపారు. బ్యాంక్ లోన్లు, ఈఎంఐల చెల్లింపులు రీత్యా ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే వేతనాలు చెల్లించాలని అసోసియేషన్ నాయకులు పమ్మి వెంకటరెడ్డి, బెజ్జం సంపత్ బాబు, కొమ్ము కిషోర్‌లు కోరారు.

భోజన నిర్వాహకులపైనా కక్షే

- జిల్లాలో 90 శాతం మందిని తొలగించిన సర్కారు
- ఫిర్యాదులు లేకున్నా తొలగింపులు
- మీరు మా పార్టీ కాదంటూ నిందలు
- పచ్చనేతలు చెప్పినవారికే వంట బాధ్యతలు
- సర్కారు తీరుపై సర్వత్రా ఆగ్రహం




కర్లపాలెం మడంలం సత్రావారిపాలెంకు చెందిన దబ్బుకూటి సుబ్బమ్మ అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనం నిర్వహకురాలిగా పనిచేస్తోంది. ఐదేళ్లుగా ఆమె విద్యార్థులకు సక్రమంగానే భోజనం పెడుతోంది. ఆమెపై ఎటువంటి ఫిర్యాదులు లేవు. కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే స్థానిక పచ్చనేతలు భోజనం నిర్వహణ బాధ్యతల నుంచి సుబ్బమ్మను అర్థంతరంగా తప్పించారు. సుబ్బమ్మ ఇప్పుడు కూలి పనులకు వెళుతోంది. పచ్చనేతల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు.



వేమూరు నియోజకవర్గ కేంద్రానికి చెందిన దళిత మహిళ దొప్పలపూడి సువర్ణలక్ష్మి వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహకురాలిగా పనిచేస్తోంది. సుమారు 400 మంది విద్యార్థులకు వంట వండి పెడుతోంది. ఏడేళ్లుగా ఆమె ఎటువంటి ఫిర్యాదులు లేకుండా సక్రమంగా పనిచేస్తోంది. కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే జులై నెలలో ఆమెను తప్పించారు. ఇప్పుడు సువర్ణలక్ష్మి కూలిపనులకు వెళుతోంది. జిల్లాలో ఇలాంటి సంఘటనలు అనేకం ఉన్నాయి.

సాక్షి ప్రతినిధి, బాపట్ల: చీరాల పట్టణానికి చెందిన పుష్పలత పట్టణంలోని కస్తూర్బా మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఆంధ్రరత్న మున్సిపల్ ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిగా 14 ఏళ్లుగా పనిచేస్తోంది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతుందన్న పేరుంది. ఎటువంటి ఫిర్యాదులు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక పచ్చనేతలు ఆమెను తొలగించేందుకు సిద్ధమయ్యారు. భోజనం సక్రమంగా లేదంటూ ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదులు చేయించి తొలగిస్తున్నామంటూ సమాచారమిచ్చారు. మనస్తాపానికి గురైన ఆమె వంటచేస్తూనే పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. పసిగట్టిన సహాయకురాలు సమాచారమివ్వడంతో అక్కడున్నవారు 108కి ఫోన్‌చేసి ఆమెను ఆస్పత్రిలో చేర్పించడంతో ప్రాణాపాయంతప్పింది. అయినా సరే కూటమి నేతలు ఆమెను బాధ్యతల నుంచి తప్పించారు.



వంట చేస్తున్న నిర్వాహకురాలు(ఫైల్)

పేద మహిళలపై కక్ష సాధింపు

చంద్రబాబు నాయకత్వంలోని కూటమి సర్కార్ కక్ష సాధింపు శృతిమించింది. అధికారంలోకి రాగానే ఉపాధి హామీ ఫీల్డ్ అసిసెంట్లు, డ్వాక్రా యానిమేటర్లు, రేషన్ డీలర్లతోపాటు పలురకాల చిరుద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించిన ప్రభుత్వం. ఇప్పుడు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వాహకులపై కక్ష సాధింపునకు దిగింది. చాలాకాలంగా విద్యార్థులకు భోజనం వండి పెడుతున్న చిరుద్యోగులను మీరు మాపార్టీ వారు కాదంటూ అర్థాంతరంగా ఉద్యోగాల నుంచి ఊడబెరుకుతోంది. వారి స్థానంలో స్థానిక పచ్చ నేతలు సూచించిన వారిని భోజన నిర్వాహకులుగా నియమిస్తున్నారు.

జిలాలే వ్యాప్తంగా 1745 పాఠశాలలు ఉండగా వాటి పరిధిలో మధ్యాహ్న భోజనం నిర్వహకురాలితోపాటు హెల్పర్ కలిపి 3,490 ఉన్నారు. ఇప్పుడు వారందరినీ తొలగించి తాము చెప్పినవారినే నియమించాలని పచ్చనేతలు సూచించడంతో విద్యాధికారులు పాతవారిని తొలగించి కొత్తవారికి బాధ్యతలు కట్టబెడుతున్నారు. ఇప్పటికే ఉన్నవారిలో 80 శాతం మందిని తొలగించగా మిగిలినవారిని తొలగించేందుకు సిద్ధమయ్యారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, పెనుమర్రు, పెద్ద గాదెలవర్రు, యడ్లపల్లితోపాటు నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఇప్పటికే తొలగించారు. అద్దంకి పరిధిలో ఉప్పుమాగులూరు, కొప్పరపాలెం, ఎస్సీకాలనీ, చీరాల పట్టణం కస్తూర్బా ఉన్నత పాఠశాల, ఆంధ్ర రత్న ఉన్నత పాఠశాల, పర్చూరు నియోజకవర్గంలో సంతరావూరు తూర్పుపాఠశాల, ఎస్సీ కాలనీ, పూనూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, యద్దనపూడి, వింజనంపాడు, గన్నవరం, చిమటవారిపాలెం పాఠశాలలతోపాటు పలుపాఠశాలల వంట ఏజెన్సీలను ఇప్పటికే తొలగించి పచ్చనేతలు మిగిలిన వాటిని తొలగించే పనిలో ఉన్నారు.

వైఎస్.జగన్ సర్కార్‌లో జీతం పెంపు

గత చంద్రబాబు ప్రభుత్వంలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, హెల్పర్‌లకు కేవలం రూ.వెయ్యి చొప్పున గౌరవవేతనం ఇచ్చారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచారు. విద్యార్థులకు ఇచ్చే మొత్తాన్ని మరింతగా పెంచారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో పనిచేసినవారిని తొలగించక కొనసాగించారు. కానీ అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం ఇప్పుడు కేవలం రూ.3 వేలు గౌరవవేతనం వచ్చే చిరుద్యోగులపై కక్షగట్టి తొలగించి వారి కడుపు కొట్టేందుకు సిద్ధమవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చంద్రబాబు ప్రభుత్వంపై మహిళలు మండిపడుతున్నారు.

సాంకేతిక అక్షరాస్యతను అందిపుచ్చుకోవాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జిల్లాలోని డ్వాక్రా మహిళా సంఘాలలో ఉన్న చదువురాని మహిళలకు చదవడం రాయడం నేర్పించడంతో పాటు ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతను అందించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. వయోజన విద్యాశాఖ–ఎస్ఇఆర్‌పి చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. అక్షర వెలుగు వాచకాన్ని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక బృందాల మహిళలు రోజూ తరగతులకు హాజరై, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు సాంకేతికను అందిపుచ్చుకోవాలని సూచించారు.



అక్షర వెలుగు వాచకం విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

కార్యక్రమంలో వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జగన్మోహనరావు, నోడల్ అధికారి మధుసూదన రావు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మ, పర్యవేక్షకులు కొణిదల మనోరంజన్, ప్రసాద్, వెంకట స్వామి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్టాంప్ పేపర్‌కూ 'ఆ ధారే'!

- అడ్డగోలు నిబంధనలతో వెండార్లకు తిప్పలు
- ఆధార్ నంబర్ ఇచ్చి, ఓటీపీ చెబితేనే లభ్యం
- కంప్యూటర్, ప్రింటర్ వంటి సామగ్రి తప్పనిసరి
- అసలే అరకొరగా సాగుతున్న అమ్మకాలు

గుంటూరువెస్ట్: జిల్లాలోని స్టాంపు వెండార్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విధానం వీరితోపాటు ప్రజలకు కూడా కష్టాలు తెచ్చిపెడుతోంది. గతంలో స్టాంపు కావాలంటే నేరుగా వెండార్ వద్దకు వెళ్లిగానీ, ఎవరినైనా పంపించిగానీ కొనుగోలు చేసుకోవచ్చు. ఇప్పుడు స్టాంపు కావాల్సిన వారే వెళ్లాలి. ఆధార్ కార్డు నెంబరు ఇచ్చి వారి ఫోన్ నెంబర్‌కు వచ్చే ఓటీపీ చెప్పాలి. అప్పుడు కంప్యూటర్‌లో నమోదు చేసి స్టాంపు ప్రింట్ తీసి ఇస్తారు. స్టాంపు కోసం కనీసం 15 నిమిషాలకుపైనే పడుతోంది. ఆన్‌లైన్‌లో ఆధార్ ఓపెన్ కాకపోతే స్టాంపు లభించదు.

కంప్యూటర్ తదితరాలు అవసరం

ప్రతి స్టాంపు వెండార్ ఒక దుకాణంతోపాటు కంప్యూటర్, ప్రింటర్, డిస్‌ప్లే ఏర్పాటు చేసుకోవాలి. ఈ వృత్తిలో చాలామంది పెద్దవారు ఉన్నారు. అరకొర ఆదాయంతో ఇంత సెటప్ ఏర్పాటు చేసుకోవడం సాధ్యం కాదు. చాలామందికి కంప్యూటర్ పరిజ్ఞానం లేదు. పైగా స్టాంపుల విక్రయం అరకొరగానే ఉంటోంది. రోజు సంపాదించే రూ.మూడు నాలుగొందలతోనే జీవిస్తున్నారు. వారందరూ వృత్తికి దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది. గడిచిన నెల రోజుల నుంచి కనీసం తీసుకున్న స్టాకులో 5 శాతం కూడా స్టాంపు వెండార్లు విక్రయించలేదు.

చాలా ఇబ్బందులు

కొత్త విధానంలో నిబంధనల అమలు సాధ్యం కావడం లేదు. ఆధార్ కార్డు నెంబర్, ఓటీపీ చెప్పమంటే ప్రజలు తిరస్కరిస్తున్నారు. రోజుకు రూ.500 కూడా ఆదాయం రాని వెండార్లు... ప్రత్యేకంగా షాపు, కంప్యూటర్, ప్రింటర్ వంటి వి ఏర్పాటుచేసుకోవడం ఇబ్బందికరమే. చాలా మంది స్టాంపుల విక్రయాలు ఆపేస్తున్నారు. ఇప్పటికే అధికారులకు వినతిపత్రాలు అందించాం.

– షేక్ రషీద్, స్టాంపు వెండార్ల సంఘం జిల్లా జేఏసీ చైర్మన్

ఐజీ కార్యాలయం ఏకపక్ష నిర్ణయం

కొత్త విధానం అమలులో రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖాధికారుల పాత్రే కీలకం. కనీసం జిల్లా రిజిస్ట్రార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు, స్టాంపు వెండార్లకు ముందు చెప్పకుండానే అమలుచేస్తున్నారు. వెండార్ స్టాంపులు విక్రయించాలంటే ముందుగా కంప్యూటర్‌లో లాగిన్ అవ్వాలి. ఓటీపీ వస్తుంది. దానిని నమోదుచేయాలి. 15 నిమిషాలు కంప్యూటర్ వాడకపోతే మళ్లీ మొదటికే వస్తుంది. పాత తేదీల్లో స్టాంపులు విక్రయించకుండా ఈ విధానం తెచ్చామని ఉన్నతాధికారులు అంటున్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె రూరల్: విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మధ్యతరగతి, పేద వర్గానికి చెందిన విద్యార్థులే ప్రభుత్వ కళాశాలకు వస్తుంటారని, వీరిని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగా మధ్యాహ్న సమయంలో నాణ్యత, విలువలతో కూడిన భోజనం అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు అందించే భోజనం అధ్యాపకులు నిత్యం పర్యవేక్షిస్తుండాలని, భోజనంలో ఎటువంటి నాణ్యత లోపించినా సహించేదిలేదన్నారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకట మురళి, ఆర్డీఓ నేలపు రామలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకట మురళి

వైఎస్సార్ సీపీ అభిమాని ఆత్మహత్యాయత్నం

- టీడీపీ నాయకుల వేధింపులే కారణం
- రేపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలింపు

భట్టిప్రోలు: తెలుగుదేశం పార్టీ నాయకుల వేధింపులు తాళలేక వైఎస్సార్ సీపీ అభిమాని పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన ఇది. భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని తాతావారిపాలెం గ్రామానికి చెందిన పడమటి శేషగిరిరావు శనివారం భట్టిప్రోలు పరిధిలోని పంట పొలాల్లో పురుగుమందు తాగి అపస్మారక స్థితిలో ఉన్నాడు. పంట పొల్లాలో పనులు చేసుకుంటున్న వ్యవసాయ కూలీలు గుర్తించి అధికారులకు సమాచారం తెలియజేశారు. సమాచారం మేరకు కుటుంబ సభ్యులు, బంధువులు 108 వాహనంలో రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు రేపల్లె ప్రభుత్వాస్పత్రికి చేరుకుని బాధితుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పడమటి శ్రీనివాసరావు, జంగం వాసు, బొల్లెద్దు ప్రతాప్, వాకా అంకబాబు, మోర్ల సత్యనారాయణ, పీజీ అరుణ్‌శాస్త్రి, పడమటి సాయి, చంద్రశేఖరరావు, యన్నం సురేష్ ఉన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న అశోక్‌బాబు

కొంపముంచుతున్న న'కిల్' మందులు

- మొక్కజొన్న రైతును నిలువునా ముంచిన అగస్త్య కంపెనీ
- మండలంలో 30 ఎకరాల్లో నష్టపోయిన మొక్కజొన్న రైతులు
- రెండోసారి వేసినా కూడా ఎండిపోతున్న వైనం

జే.పంగులూరు: అయాయక రైతుల జీవితాలతో ప్రైవేటు కంపెనీలు ఆడుకుంటున్నాయి. మొన్నజొన్న రైతులను అగస్త్య కంపెనీ నిలువునా ముంచింది. అట్రాజిన్ పేరుతో తయారుచేసిన కల్తీ మందు మొక్కజొన్న పైరును ఎండబెడుతోంది. కలుపును తొలగించుకునేందుకు ఆ మందును వాడిన పొల్లాలో మొక్కజొన్న పైరు నిలువునా ఎండిపోతుంది. పంగులూరు మండలంలో నాలుగు గ్రామాల్లో ఈ మందును రైతులు ఉపయోగించగా పొలాలు మొత్తం ఎండిపోయాయి. ఇప్పటికి సుమారు 30 ఎకరాలు వరకు మొక్కజొన్న పైరు నిలువునా ఎండిపోయింది. పంగులూరు మండలంలోని బైటమంజులూరు, కొండమంజులూరు, కొండమూరు, ముప్పవరం, రేణింగవరం గ్రామాలకు చెందిన మొక్కజొన్న రైతులు సుమారు 45 రోజుల క్రితం మొక్కజొన్న పైరులు సాగు చేశారు. పొలాల్లో కలుపురావడంతో ఆ కలపును తొలగించుకునేందుకు ముప్పవరంలో హనుమాన్ ట్రేడర్స్ షాపు వద్ద అట్రాజిన్ మందును తీసుకుపోయి వేశారు. సుమారు 15 రోజుల క్రితం ఈ మందును వేయగా పైరు ఎండుముఖం పట్టింది. ఆకులు ఎండిపోతూ, మచ్చలు పడి, ఎర్రగా మారిపోతుంది.

రెండోసారి పంట వేసినా ఎండుముఖం.

ఎండిపోయిన మొక్కజొన్న పంటను రైతులు పరిశీలించగా మోము ఊడివచ్చి మగ్గిపోయిన వాసన వస్తోంది. కొంతమంది రైతులు పైరును మళ్లీ దున్ని సాగు చేసిన ఆ పైరు కూడా ఇదే విధంగా వస్తోందని రైతులు తెలిపారు. ఒక వైపు మొక్కజొన్న విత్తనం విత్తుకునే సీజన్ దాటిపోగా, రెండోసారి విత్తన మొక్క వచ్చిన తిరిగి ఆదే పరిస్థితి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పురుగు మందుల షాపు యజమానిని రైతులు అడిగితే వారికి 19.19.19తోపాటు, బయోసిస్టమిట్ హ్యూమిక్ యాసిడ్‌ను కూడా ఉచితంగా ఇచ్చి ఇది బలానికి పైరు ఎదుగుదలకు ఉపయోగపడుతుందని తెలిపాడు. ఎకరాకు రూ.40 వేల పైగా పెట్టుబడి పెట్టి నిలువునా మోసపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించిన మొక్కజొన్న పైరు బాగుందని, దిగుబడులు కూడా వచ్చే అవకాశం ఉందని ఆశపడుతున్న సమయంలో అగస్త్య కంపెనీ నిలువునా ముంచిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఎండిపోయిన మొక్కజొన్న పైరు



రైతులు వాడిన కలుపుమందు ప్యాకెట్

రెండెకరాల మొక్కజొన్న ఎండిపోతోంది



సాగుచేసిన రెండు ఎకరాల మొక్కజొన్న పైరు కలుపు మందు వేయడంతో నిలువునా ఎండిపోయింది. ఎకరాకు రూ.40 వేలు నష్టపోయాం. పెట్టుబడి కోసం వేలల్లో అప్పు తీసుకొచ్చి మరీ వేశాం. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

– సరికొండ సక్కుబాయమ్మ, మహిళా రైతు

10 ఎకరాల్లో పంట ఎండిపోతోంది



నేను 10 ఎకరాల్లో కౌలు భూమి తీసుకొని మొక్కజొన్న సాగు చేశా. కలపు మందు చల్లడం వలన మొత్తం పైరు ఎండిపోయింది. ఎకరాకు రూ.20 వేలు కౌలు చొప్పున పొలం తీసుకొని ఎకరానికి రూ.40 వేలు పెట్టుబడి పెట్టి వేశాను. ఆ డబ్బు ఎలా వస్తుందో అర్థం కావడం లేదు.

–నాయుడు సుబ్బయ్య, కొండమూరు

పైరును పరిశీలనకు పంపిస్తాం

కల్తీ కలుపు మందు వలన ఎండిపోయిన పైరును పరిశీలన నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తాం. శాస్త్రవేత్తలను కూడా పిలిపించి పరిశోధనలు జరిపిస్తాం. రైతులను తప్పనిసరిగా ఆదుకుంటాం.

– సుబ్బారెడ్డి, మండల వ్యవసాయశాఖ అధికారి

మొక్క జొన్న రైతులను ఆదుకోవాలి

నకిలీ కలుపు మందు చల్లడం వలన నష్టపోయిన మొక్క జొన్న రైతులందరికీ తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి. ఎరువులు, పురుగు మదులు విత్తనాలు అన్నిట్లో కల్తీనేని, ఈ కల్తీని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కంపెనీపై చర్యలు తీసుకోవాలి.

– రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి రామారావు

బాల్యం చిత్తు



పుస్తకాల సంచిని భుజాన తగిలించుకుని బడికి వెళ్లాల్సిన వయస్సులో పాత గోతాం తీసుకుని చిత్తు కాగితాలు ఏరుకుంటున్నారు. బడి బయట ఎవ్వరూ ఉండటానికి వీల్లేదు అందరూ బడిలోనే ఉండాలి అని చెప్పే పాలకులులకుగానీ, అధికారులకుగానీ వీరు కనిపించకపోవడం గమనార్హం. తమిళ కుటుంబానికి చెందిన చిన్నారులు చీరాలలోని వీధుల వెంట తిరిగుతూ చిత్తు కాగితులు ఏరుకుని జీవనం సాగిస్తున్నారు. చిన్నారుల చిత్రాన్ని 'సాక్షి' కెమెరాలో బంధించింది.

– చీరాల టౌన్

ఎయిడెడ్ స్కూల్‌ను సందర్శించిన డీజీపీ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని కృష్ణానగర్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను శనివారం డీజీపీ, పాఠశాల పూర్వ విద్యార్థి సీహెచ్ ద్వారకా తిరుమలరావు సందర్శించారు. 1974లో ఇదే పాఠశాలలో ప్రాథమిక విద్య పూర్తి చేసిన ఆయన్ను సహచర పూర్వ విద్యార్థులు సన్మానించారు. సహచర పూర్వ విద్యార్థులు, పాఠశాల పాలకవర్గ ఆహ్వానంపై పాఠశాలకు యూనిఫాంతో డీజీపీ వచ్చారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు ఇలా వచ్చినట్లు చెప్పారు. పాఠశాలలో చదివిన సమయంలో ఉన్న అడ్మిషన్ రిజిస్టర్‌లో తన పేరు, వివరాలను ఆయన చూసుకున్నారు. కోబాల్ట్‌పేటకు చెందిన చిన్ననాటి మిత్రుడు షరీఫ్‌ను పలకరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి డాక్టర్ ఓవీ రమణ, పాఠశాల కరస్పాండెంట్ తూములూరి శ్రీరామమూర్తి, కార్యదర్శి తూములూరి సమ్మోహిత్, మాజేటి గురవయ్య కళాశాల ప్రిన్సిపాల్ మాధవపెద్ది విజయలక్ష్మి, హెచ్‌ఎం చిలుకూరి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డీజీపీ ద్వారకా తిరుమలరావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు, పాఠశాల ప్రతినిధులు

క్లుప్తంగా

యాచకురాలి మృతదేహానికి అంత్యక్రియలు



కర్లపాలెం: గ్రామ సచివాలయానికి సమీపంలో ఉన్న బస్టాండ్‌లో మృతి చెందిన యాచకురాలికి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. పేరు తెలియని ఓ యాచకురాలు స్థానిక బస్టాండ్‌లో శుక్రవారం రాత్రి మృతి చెందటంతో స్థానికుల సమాచారం మేరకు గ్రామ సర్పంచ్ సక్కా లలితకుమారి కార్యదర్శి సునీత బస్టాండుకు వచ్చి యాచకురాలి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు.

రెండు లారీలు ఢీ

ముగ్గురికి గాయాలు

కర్లపాలెం: ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొనటంతో ముగ్గురికి గాయాలైన సంఘటన శనివారం కర్లపాలెం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్లపాలెం వైపు టిప్పర్ లారీ చందోలు వైపు వెళుతున్న మినీ లారీ కర్లపాలెం తుంగభద్ర డ్రెయిన్ సమీపంలో జాతీయ రహదారిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మినీ లారీ బోల్తాపడటంతో అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయని వారిని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

పోలీసుల అదుపులో నిందితుడు



మార్టూరు: రోజురోజుకూ చిన్నారులు, మహిళలపై లైంగిక దాడులు ఎక్కువవుతున్నాయి. ఓ బాలికపై 30 ఏళ్ల వివాహితుడు మద్యం మత్తులో లైంగికదాడికి యత్నించాడు. ఈ ఘటన శనివారం సాయంత్రం మండలంలోని ఇసుక దర్శి గ్రామంలో కలకలం రేకెత్తించింది. ఏఎస్సై మహబూబ్ బాషా వివరాల మేరకు.. గ్రామంలోని ఓ ప్రాథమిక పాఠశాలలో బాలిక (11) నాలుగో తరగతి చదువుతోంది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పాఠశాల సమీపంలో నివసించే ఓ యువకుడు ఆ బాలికను తన ఇంట్లోకి పిలిచి తలుపులు వేసుకున్నాడు. గదిలో నుంచి బాలిక అరుపులు విన్న సహచర విద్యార్థులు గమనించి ఉపాధ్యాయులను, స్థానికులను అప్రమత్తం చేశారు. అందరూ కలిసి నిందితుడు మార్నెళ్ల నాగరాజు ఇంటి ముందు చేరి కేకలు వేయడంతో కొంతసేపటికి అతను బాలికను ఇంటి వెనక వైపు గల మరో మార్గం నుంచి బయటకు పంపించాడు. బాలిక బంధువుల సమాచారంతో పోలీసులు నిందితుడు నాగరాజును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. బాలిక నాయనమ్మ వెంకాయమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

చెరువు కట్టపై టీడీపీ నేతల కన్ను

- భారీగా చెట్లు నరికివేత
- టీడీపీలోని రెండో వర్గం ఫిర్యాదు
- అడ్డుకున్న పంచాయతీ కార్యదర్శి



కట్టపై చెట్లను నరికివేస్తున్న కూలీలు

నరసరావుపేట రూరల్: మండలంలోని కాకాని చెరువు కట్ట మీద చెట్లను టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా నరికి వేస్తున్నారు. కాకాని–ముత్తనపల్లి రోడ్డులోని చెరువు కట్ట మీద భారీ చెట్లు ఉన్నాయి. వందల సంఖ్యలో కట్టకు రక్షణగా ఉన్నాయి. 20 సంవత్సరాల వయస్సు గల తుమ్మ, వేప, సుబాబుల్ చెట్లు ఇందులో ఉన్నాయి. వీటిపై టీడీపీ గ్రామ నాయకుల కన్ను పడింది. శనివారం చెట్ల నరికివేతను ప్రారంభించారు. గ్రామంలోని టీడీపీకి చెందిన రెండో వర్గం దీనిపై పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించింది. ఆయన అక్కడకు చేరుకొని నరికివేతను అడ్డుకున్నారు. కోటప్పకొండ ప్రభ నిర్మాణానికి అయ్యే ఖర్చుల కోసం నియోజకవర్గ ప్రజాప్రతినిధి చెట్లను నరికి, విక్రయించమని చెప్పాడని టీడీపీ నాయకులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఫోన్‌లో ప్రజాప్రతినిధి సంప్రదించగా తాను ఎవరికీ చెప్పలేదని తెలిపాడు. దీంతో అటవీశాఖ, మైనర్ ఇరిగేషన్ అధికారులకు పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేశాడు. 200 ఎకరాల చెరువుకు రక్షణగా ఉండే చెట్లను నరికివేసేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నించడంపై గ్రామస్తుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

నదిలోకి దూకిన యువకుడు

- కాపాడటానికి వెళ్లిన పోలీసులు
- ముప్పతిప్పలు పెట్టి పరారీ



ఒడ్డుకు రావాలని ప్రకాశం బ్యారేజ్‌పై నుంచి సూచిస్తున్న పోలీసులు

తాడేపల్లిరూరల్: ప్రకాశం బ్యారేజ్ రైలింగ్ నుంచి కృష్ణా నదిలోకి ఓ యువకుడు శనివారం దూకాడు. ఆత్మహత్య చేసుకున్నాడని భావించి కాపాడేందుకు వచ్చిన పోలీసులను ముప్పుతిప్పలు పెట్టి పారిపోయాడు. వివరాలు.. కృష్ణానది ప్రకాశం బ్యారేజ్ 14వ ఖానా వద్ద దిగువ ప్రాంతంలో యువకుడు నీటిలోకి దూకాడు. అది గమనించిన ప్రజలు తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. యువకుడు పైకి తేలకుండా నీటిలోనే ప్రకాశం బ్యారేజ్ కిందకు వెళ్లడంతో పైనున్న వారికి అతడు కనిపించలేదు. ఆత్మహత్య చేసుకున్నాడని భావించారు. పోలీసులు వచ్చి పరిశీలించగా సదరు యువకుడు నీటిలో తేలియాడుతూ కనిపించాడు. సుమారు 50 అడుగుల ఎత్తు నుంచి దూకడంతో నీటి అడుగున ఉన్న కాంక్రీట్ ఫ్లోరింగ్ తగిలి మృతి చెంది ఉంటాడని భావించారు. 20 నిమిషాల అనంతరం ఆ యువకుడు ఈత కొట్టడంతో పోలీసులు పైకి రావాలని సూచించారు. పోలీసులను చూసి కంగారు పడిన అతడు దిగువ యాప్రాన్ నుంచి కృష్ణానది గేట్లు ఎక్కాడు. మళ్లీ ఎగువ ప్రాంతంలో ఈదుకుంటూ కిందికి దిగి ప్రకాశం బ్యారేజ్ గేట్లకు కిందభాగంలో ఉన్న సొరంగ మార్గం ద్వారా విజయవాడ వైపు వెళ్లిపోయాడు.



కృష్ణానది నీటిలో తేలియాడుతున్న యువకుడు

నాలుగేళ్లుగా భోజనం చేయడానికీ అవస్థలే

ఆపరేషన్‌తో మహిళకు ఉపశమనం కల్పించిన జీజీహెచ్ వైద్యులు



గుంటూరు మెడికల్: నాలుగు సంవత్సరాలుగా అన్నం మింగుడుపడక, మంచినీరు తాగేందుకు కూడా అవస్థలు పడుతూ తీవ్ర అనారోగ్యానికి గురైన మహిళకు గుంటూరు జీజీహెచ్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి వ్యాధి నుంచి విముక్తి కల్పించారు. శనివారం గుంటూరు జీజీహెచ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అందె కోటి వెంకటేశ్వరరావు మీడియాకు వెల్లడించారు. మచిలీపట్నానికి చెందిన వెంకట మహాలక్ష్మి నాలుగేళ్లుగా ఈ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి నయం కాలేదు. గత ఏడాది డిసెంబరులో జీజీహెచ్‌కు రాగా, వైద్య పరిభాషలో ఎక్లాషియా కార్డియా సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. డిసెంబరు 24న సుమారు 3 గంటల సేపు విజయవంతంగా ఆపరేషన్ చేశామన్నారు. ఎనస్థీషియా వైద్య విభాగాధిపతి డాక్టర్ పోలయ్య సహకరించారన్నారు. రోగిని డిశ్చార్జి చేసినట్లు వెల్లడించారు. సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ ఎండోస్కోపిక్ ద్వారా కోత, కుట్లు లేకుండా అత్యాధునిక వైద్య పరికరాలతో ఆపరేషన్ చేశారన్నారు. వైద్యులను అభినందించారు.

సర్వేలను నూరు శాతం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ

తాడికొండ: ప్రభుత్వం సూచించిన ఆరు రకాల సర్వేలను వేగవంతంగా నూరు శాతం పూర్తిచేయాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ అన్నారు. తాడికొండ, తుళ్లూరు మండల పరిషత్ కార్యాలయాల్లో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొనసాగుతున్న మిక్సింగ్ ఆధార్, హౌస్ హోల్డ్ సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే, గ్రామ పంచాయతీ పరిధిలోని కమ్యూనిటీ స్థలాల ఆన్‌లైన్ సర్వే, సీఏసీఎస్‌లో రుణాలు తీసుకున్న వారి నిర్ధారణ సర్వే నూరుశాతం పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణ పథకం కింద పనులు ప్రారంభించి నిలిపివేసిన వాటిని వెంటనే పూర్తి చేయించేలా చూడాలన్నారు. తాడికొండ, తుళ్లూరు మండలాల ఎంపీడీవోలు కె సమతావాణి, కానూరి శిల్ప, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట రూ.8 లక్షల మేర మోసం

- ఇన్‌స్ట్రాగామ్‌లో పరిచయమైన ఆర్మీ ఉద్యోగి దగా
- మనస్తాపంతో బాధిత మహిళ ఆత్మహత్యాయత్నం



నిందితుడు ఆళ్ల రామకృష్ణ

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): ఇన్‌స్టాగామ్‌లో ఏర్పడిన పరిచయంతో ఆర్మీ ఉద్యోగి చేతిలో నగరానికి చెందిన మహిళ బండి ఆశ (35) మోసపోయారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన బండి ఆశ పిల్లల చదువుల కోసం నగరానికి వచ్చారు. ఆర్మీలో పనిచేసే ఆళ్ల రామకృష్ణ ఇన్‌స్టాగామ్‌లో ఆమెకు పరిచయం అయ్యాడు. ఆర్మీలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ పశ్చిమ బెంగాల్‌కు రావాలని నమ్మబలికాడు. ఆమె వెళ్లాక రూ.8 లక్షలు తీసుకున్నాడు. 11 రోజుల పాటు అతనితో కలిసి ఆమె పశ్చిమ బెంగాల్‌లో ఉన్నారు. ఉద్యోగం కోసం ఎన్నిసార్లు అడిగినా మాట దాటవేశాడు. ప్రస్తుతం ఆర్మీలో పరిస్థితులు బాలేదంటూ రామకృష్ణ తన భార్య పేరుతో విజయవాడకు రైలు టికెట్ తీసి ఆశను బలవంతంగా పంపించేశాడు. తరువాత ఎన్నిసార్లు అడిగినా రామకృష్ణ స్పందించలేదు. దీంతో రామకృష్ణ స్వగ్రామం గుంటూరు జిల్లా పొన్నూరు వెళ్లి నగదు కోసం ఆమె అడిగారు. అసభ్యంగా మాట్లాడుతూ దాడి చేసేందుకు యత్నించడంతో భయపడి విజయవాడకు వచ్చేశారు. అనంతరం నవంబర్ 25న స్పందనలో ఫిర్యాదు చేశారు. డిసెంబర్ 5వ తేదీన ఈ కేసును దర్యాప్తు నిమిత్తం గుణదల పోలీస్‌స్టేషన్‌కు పంపించారు. గుణదల పోలీసులు కేసు నమోదు చేసి రామకృష్ణను పిలిపించి కౌన్సెలింగ్‌కు సైతం పంపించారు. అయినప్పటికీ డబ్బులు ఇవ్వకపోగా నోటికి వచ్చినట్లు మాట్లాడాడు. ఆమె మనస్తాపానికి గురయ్యారు. ఇంట్లో సైతం గొడవలు జరగడంతో మురళీనగర్‌లోని నివాసంలో శనివారం ఆమె ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తనకు జరిగిన అన్యాయం ఎవరికీ జరగకూడదని ఆమె పేర్కొన్నారు. తన నగదు తిరిగి ఇవ్వాలని కోరారు. ఆశ ఆస్పత్రి పాలవ్వడంతో ఆమె ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

శుచిగా, రుచిగా భోజనం అందించాలి

బాపట్ల డీఈవో పురుషోత్తం



కేజీబీవీలో బాలికలతో మాట్లాడుతున్న డీఈవో పురుషోత్తం

బల్లికురవ: ప్రభుత్వం డ్రాప్ అవుట్ అవకుండా విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గురుకుల బాలికల విద్యాలయాల్లో శుచిగా రుచిగా నాణ్యమైన భోజనం అందించాలని బాపట్ల డీఈవో పురుషోత్తం కోరారు. శనివారం సాయంత్రం బల్లికురవలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయంలో 6 నుంచి ఇంటర్మీడియేట్ వరకు 244 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. డీఈవో తరగతుల వారీగా బాలికలను పలు ప్రశ్నలు వేసి సమాధానం రావడంతో సంతృప్తి చెందారు. పరీక్షల సమయం ఆసన్నమవుతున్నందున రెండు నెలలపాటు కష్టపడటంతోపాటు ఇష్టపడి చదువుతూ మంచి ఫలితాలు సాధించాలన్నారు. పదోతరగతి, ఇంటర్ ఫలితాలు జీవితానికి తొలిమెట్టు అని ఆయన చెప్పారు. విద్యలో వెనుకబడిన బాలికలను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయునిలను ఆదేశించారు. అనంతరం డీఈవో సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. సమావేశంలో 100 శాతం ఫలితాలు సాధించాలని ఆయన ఆదేశించారు. తనిఖీలో ఎంఈవో 2 రమేష్‌బాబు, విద్యాలయ ప్రిన్సిపాల్ కె. సరళ కుమారి పాల్గొన్నారు.

తక్కువ ధరతో వేగంగా ఇళ్లకే వస్తువుల డెలివరీ



డోర్ డెలివరీలను ప్రదర్శిస్తున్న ఆర్టీసీ జిల్లా రవాణా అధికారి శ్రీనివాసరావు, ఉద్యోగులు

నరసరావుపేట: ఆర్టీసీ ప్రజా రవాణా సంస్థ నిర్వహిస్తున్న కార్గో సర్వీసులో నూతనంగా చేపట్టిన డోర్ డెలివరీ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ జిల్లా అధికారి ఎన్.శ్రీనివాసరావు కోరారు. డోర్ డెలివరీ సౌకర్యానికి తగిన ప్రచారం కల్పించే ఉద్దేశంతో ప్రతి ఉద్యోగి మూడు పార్శిళ్లను పంపించాలనే సంస్థ ఆదేశాలను అనుసరించి శనివారం డిపోలోని జిల్లా కార్యాలయంలో వాటిని పంపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో సర్వీసు విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రైవేటు కొరియర్ సర్వీసుల కంటే తక్కువ ధరకే చాలా వేగంగా ప్రజలకు వస్తువులు, సరుకులు, లెటర్లు, ప్యాకెట్లు, మందులు, ఆయిల్స్, నిత్యావసరాలు డెలివరీ చేస్తున్నామని తెలిపారు. డోర్ డెలివరీ సౌకర్యాన్ని గత నెల 20వ తేదీ నుంచి ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు జిల్లాల కమర్షియల్ అధికారి డి.ఆదినారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

సచివాలయాలలో కుల గణన వివరాలు ప్రదర్శించాలి: జేసీ



సమావేశంలో జేసీ సూరజ్, డీఆర్వో మురళి, అధికారులు

నరసరావుపేట: గ్రామ, వార్డు సచివాలయాలలో ఎస్సీ కులగణన వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించి, అభ్యంతరాలు స్వీకరించాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుల గడువు పూర్తయినందున త్వరలోనే నూతన కమిటీని నియమిస్తామని పేర్కొన్నారు. ప్రతి నెలా నాలుగో శనివారం జిల్లా కలెక్టరేట్‌లో పౌరసేవల దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో ఏ.మురళి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శివనాగేశ్వరరావు, జిల్లా అదనపు ఎస్పీ జేవీ సంతోష్, జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవయవాలు, నేత్ర దానంతో సజీవం

ఆదర్శంగా నిలిచిన మునెమ్మ



మునెమ్మ(ఫైల్)

బొల్లవరం(ముప్పాళ్ల): శరీరం, నేత్ర దానంతో ఆదర్శంగా నిలిచిందో మాతృమూర్తి. మండలంలోని బొల్లవరం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకురాలు, ప్రజాతంత్ర మహిళా సంఘంలో చురుకుగా పనిచేసిన కళ్లం మునెమ్మ(88) శనివారం మృతి చెందారు. ఆమె భర్త సత్యనారాయణరెడ్డి కూడా పార్టీలో పనిచేశారు. చనిపోయిన తర్వాత మునెమ్మ కోరిక మేరకు ఉదయాన్నే శంకర కంటి ఆసుపత్రి వైద్యులు కళ్లను సేకరించారు. అనంతరం భౌతికకాయాన్ని విజయవాడలోని నిమ్రా వైద్య కళాశాల వైద్యులు స్వాధీనం చేసుకొని అంబులెన్స్‌లో తీసుకెళ్లారు. తొలుత సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ తదితరులు మునెమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



మునెమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్ తరలింపుపై ఫైన్



అధికారులు నిలిపిన గ్రానైట్ లోడు లారీ

నకరికల్లు: నిబంధనలు పాటించకుండా గ్రానైట్ తరలిస్తున్న లారీలను కమర్షియల్ టాక్స్ అధికారులు శనివారం నిలిపి వేశారు. ప్రకాశం జిల్లా నుంచి తెలంగాణ, మహారాష్ట్ర వైపు భారీ లారీలలో గ్రానైట్ రాళ్లను తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న సీటీఓ అధికారులు మండలంలోని అడ్డరోడ్డుకు సమీపంలో అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై తనిఖీలు చేపట్టారు. హైవేపై వస్తున్న లారీలను గుర్తించి వారి వద్ద ఉన్న పత్రాలను తనిఖీ చేశారు. దాదాపు గంటల తరబడి వాహనాలను నిలిపివేశారు. తరువాత వేబ్రిడ్జి వద్ద కాటా వేసి భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించినట్లు సమాచారం.